అల్లం - బెల్లం

చలికాలం నీరెండ ముగ్గుల వాకిలని ముద్దాడుతోంది మధ్యాహ్నం పైరగాలి మనుషుల్ని పలుకరించి మనసుల్ని దోచుకుంటోంది. అయినా అమృతమ్మలో ఆందోళన పెరుగుతూనే ఉంది మనసంతా కొడుకు మీదుంది "మధురా! అనందు ఇంకా రాలేదేమిటమ్మా?" కోడలు నడిగింది. రూపాయి కాసంత బొట్టు చెమక్కుమంది

"ఏమో అత్తయ్యా! ఆయన మొన్ననే రావాల్సింది మీ అబ్బాయే ఘన కార్యాలు సాధిస్తున్నారో ఏమో. ?" మధుర రుసరుసల్ని పట్టించుకోకుండా మూడు రాళ్ళ, మూడు రంగుల ముక్కుపుడక తళుక్కుమంది అది త్రివర్ణ పతాకం రెపరెపలాగుంది

"గడప దాటితేచాలు... ఈ మొగాళ్లకు ఇల్లూ, ఇల్లాలు గుర్తుకురావు .."

"అందులోనూ మీ అబ్బాయైతే మరీ అన్యాయమత్తయ్యా!

"మనమెంత మొత్తుకున్నా ఏంలాభంలే! వాని కన్నీ మీ మామయ్య బుద్ధులొచ్చేసినై ."

గణేశ్ నగర్లో విలక్షణమైన ఇల్లు. విలక్షణమైన ఇంట్లో ?లక్షణమైన కుటుంబం. అది చిన్న కుటుంబం కాబట్టి చింతలు ?ేవనుకుంటారంతా. ఆరబోసుకున్న అనుభవాలను అనుభూతులుగా ?ూర్చుకుని నెమరేసుకుంటున్న వెంకట్రామయ్య ఆ ఇంటి యజమాని ?తని ఏకైక సంతానమే ఆనందరావు - ఓ ప్రభుత్వోద్యోగి వృత్తి ?భుత్వోద్యోగమైనా ప్రవృత్తి రచనా వ్యాసంగము .హాయిగా కవిత్వం ?స్తూ ఆనందనందన వనములో విహరిస్తాడు ఆనంద్ కవిత్వమంటే ?ికోసుకునే అభిమానులెందరో ఉన్నారు.

అంతటి ఆనందరావు ఆర్రోజుల క్రితం ఆఫీసుపని మీద హైద్రాబాదెళ్లి తిరిగి రాలేదింకా

"అత్తా కొడళ్లంటే అమృతమ్మ - మధురల్లాగుండాలి" అనుకుంటారా వీధిలో

"వీడెంత గొప్ప కవైతే మాత్రమేం లాభం? కన్నతల్లి, కట్టుకున్న పెంళ్లా ఇంటి వద్ద కళ్లల్లో వత్తులేసుకుని ఎదిరి చూస్తుంటారనే ఇంగిత జ్ఞానం గూడాలేదాయె" గొణుక్కుంది అమృతమ్మ

తనవంతు సణుగుడు ప్రారంభించబోయింది మధుర ఝుమ్మని ఆటోవచ్చి ఇంటిముందాగింది ఫుల్‌సూటులో, చేతిలో సూటుకేసుతో దిగాడు ఆనందరావు అత్తా కోడళ్ళ మొహాలు అరవిరిసిన మందారాలైపొయినై

"మానాయనే ! అట్లా చిక్కిపోయావేమిట్రా?" అమృతమ్మ ఎదురువెళ్లి తోడ్కొని వచ్చింది.

"నేను దుక్కలా గున్నానమ్మా!" ఆనంద్ నవ్వేశాడు.

"మూడ్రోజుల్లో వస్తానని ఆర్రోజులు అటే పోతే మేమేనుకోవాలండీ?" అని మూతి ముడేసుకుని గదిలో దూరింది. మధుర

"ఆఫీసు పనితోపాలు వేరే పనిగూడా ఉంది. అందుకే ఆగిపోయానమ్మా." ఆనందరావు ఆనందాన్ని అలసట మింగేసింది.

సూటుకేసు టేబుల్ నాశ్రయించింది.

"మా ఆతృత అలాంటిదిరా! ఎప్పుడు బయలుదేరావో ఏమో.. రా బొంచేద్దువుగాని."

ఆహా! అమ్మ మనసు అమృతం

"నాన్న లేడామ్మా!" అడుగుతూ సూటుకేసు తెరిచాడు.

"ఊళ్లు తిరగడమంటే మీ తండ్రీకొడుకులకు సరదాగద నాన్నా! ఎవరో బాల్యమిత్రుని కూతురు పెళ్లటా పొద్దున్నే వరంగల్ వెళ్లారు నువ్వురా, భోంచేద్దువుగాని " వెనక్కుతిరగబోయి మానుకుంది

ఘల్లు ఘల్లు మంటు గజ్జల రిక్షా ఒకటి ఇంటి ముందు నుంచి వెళ్లి పోయింది. ఏమనుకుందో ఏమో . మధుర గది నుండి బయటి కొచ్చింది" రండి వడ్డిస్తా. భోంచేద్దురుగాని " కాటుక కళ్లు కందిరిగల్లా కదిలాయి. భార్య మొహమ్మీదో చిరునవ్వు విసిరేసి సూటుకేసులోంచి పొడవాటి పాకెట్ తీసి టేబుల్ సొరుగులో పెట్టేశాడు అత్తా కొడళ్లనా దృశ్యం అబ్బుర పరిచింది.

"పొద్దున్నే టిఫిన్ అయింది కానీ..." అంటూ కాయితం పొట్లంతీసి తల్లి కందించాడు. పొట్లం విప్పుకుంది. అమృతమ్మ కళ్ళు ఆనంద జ్యోతులైపోయినై.

"ఆహా! జపమాలిక! మంచి రుద్రాక్షల జపమాల. . కళ్లకద్దుకుంది. కొడుకు హైద్రాబాదుకెళ్లేప్పుడు "హైద్రాబాదు రామకృష్ణా మిషన్లో మంచి జమమాలలు దొరుకుతాయట్రా ఆనందూ!" అన్న సంగతి గుర్తుకొచ్చింది అంబరాని కెగసిన సంబరంతో పూజాగదిలో కెల్తోంది. పాకెట్ కళ్లల్లో మెరిసింది. మనసులో ఏదో కలుక్కుమంది.

ఆ సొరుగులో దాచిన పాకెట్టులో ఏముందో! అదెవరి కోసమో!... కొండంత సంబరం కొండెక్కి పోయింది.

"ఇది.... నీ కోసం మధూ!" పూలదండ తీసి పెళ్లాం జడలో తురిమాడు. మల్లెల వాసన గుప్పుమంది. మధుర మనసులో మలయమారుతం వీచింది. దండ జడను గుండెలమీదికి లాక్కొని సవరించుకుంటోంది. ఎక్కడో ఏదో ముల్లులా గుచ్చుకుంది... ఆ సొరుగులో దాచిని పాకెట్లో ఏముందో! అదెవరి కోసమో! బుగ్గల మీది సిగ్గులు నుగ్గునుగ్గైపోయినై.

ఆ పాకెట్ వాళ్లమ్మ కోసమే అయుంటుంది అందులో పట్టుచీర ఉండొచ్చు బతుకమ్మ పండగనాడు అత్తయ్య "అన్నాళ్లు ఉద్యోగం చేసి రిటైరైనా ఎన్నడన్నా నాకో పట్టు చీరకొనిపెట్టారా" కన్నకొడుకు ముందు కట్టుకున్న మొగుణ్ని నిలదీసింది గదూ! దాని ఫలితమే ఆ పాకెట్ పట్టుచీర! కాని. తల్లికేదన్నా కొనివ్వాలంటే పెళ్లాం చాటుకే ఇవ్వాలా? నాగ్గూడా ఓపట్టుచీర కావాలని ఎన్ని సార్లడిగాను దేనికైనా ప్చ. ప్రాప్తముండాలి కాటుక కళ్లల్లోంచి కాంతిరేఖలు మాయమైపోయినై.. మొహం ముకుళించుకుపోయింది ఆనంద్ కాశ్చన్యమేసింది.

"అదేమిటి మధూ! అలాగైపోయివేందీ?" కౌగిట్లో బంధించబోయాడు.

"ఎలాగైతే మీకేందటా!" మూతి మూడుపంకలు తిరిగింది. వెంటనే మంచమీద మూడంకెవేసి అటు తిరిగింది.

"ఇద న్యాయం మధు! ఆర్రోజులు తర్వాత అవురావురు మంటూ వస్తే..."

"చాల్లెండి పెదాలమీది ప్రేమ. తల్లి అల్లం, పెళ్లాం బెల్లం అన్న సామెత తిరగబడింది గదూ!"

"నువ్వేమంటున్నావో నాకొక్క ముక్కగూడా అర్థంగాలేదు. కడుపులో ఎలుకలు చెడుగుడు ఆడుతున్నాయి పద మధూ!"

"అయితే ... మీ అమ్మగారి నడిగి ఓ పిల్లని మింగేయండి."

అడవాళ్ల మాటలకు అర్థాలే వేరన్నారు గానీ... ఈ విడ ఉద్దేశ్యమేమిటో అర్థమై చావట్లేదే!.

"దేవిగారు అలకపాన్పెక్కారెందుకో?" భుజాలు పట్టి ఇటు తిప్పాడు.

"దేవరవారి కరుణా కటాక్షవీక్షణాలకు తట్టుకోలేక అయినా నేను అలకపాన్పెక్కితే మీకెందుకూ, నుటక మంచమెక్కితే మీకెందుకూ?" చేతులు ఝాడించిపారేసి అటు తిరిగింది

* * * * *

అంత పెద్ద పాకెట్టును అందులో దాచెయ్యడం నేను చూడలేదనుకున్నాడేమో వెధవ। ఇంతకూ అందులో ఏముందో। పెళ్లాం కోసం పట్టుచీర కావచ్చు అమృతమ్మ బుర్రలో ఏవేవో గిర్రుర్రు మంటున్నై. బతుకమ్మ పడగనాడు పట్టుచీర కోసం వాళ్ల నాన్ననడిగానుగదా। అప్పట్నుంచే తనకే ముందు తెమ్మని వాణ్ని సాధిస్తుందేమో అ మహాతల్లి! కని పెంచిన తల్లి నోరుతెరచి అడిగింది గదాని నాగ్గూడా వాడో పట్టుచీర కొనిపెడితే తప్పా? పెళ్లాంకోసవ తెచ్చిన దాన్ని నేనెక్కడ చూస్తానోననవి చటుక్కున దాచేసుకున్నాడు ఒరేయ్! నేను నీ అమ్మాన్నా!..

"అమ్మా! ఆకలేస్తుందే!" చిన్నపిల్లాడిలా వచ్చి అడిగాడు ఆనందరావు. అమ్మ మనసు ఆర్ధ్రమై పోయింది

"అయ్యో... నాయనా.. రా.. రా!" చక చకా వడ్డించేసింది.

మొగుణ్ని కొంగుకు కట్టుకుని అదితే, ఇదితే అని అడగడం తెల్సుగానీ, ఆర్రోజుల తర్వాత గూడా మొగుడుకో అన్నంముద్ద పెట్టాలనే యావలేదు... కుతకుత లాడింది. పెరుగు వడ్డించేప్పుడు ఆ పాకెట్లో ఏముందో అడగాలన్పించింది కాని ఆమాట నాలుక దాకా రాలేదు.

ఇదేమిటీ! ప్లేట్లో అన్నం పెట్టి నప్పట్నుంచి భోజనం పూర్తయేదాకా ఏవేవో కబుర్లు చెబుతూండే అమ్మ.. మౌన ముద్ర దాల్పిందెందుకో? ఆనందరావు కదోలాగాన్పించింది. దుక్కలా పెళ్లాముండగా ఒక్కచిక్కిన తల్లిని తిప్పలు బెడుతున్నావని నిరసనేమో।

కొత్త చుట్టాల ముందు మాటలు వెతుక్కుంటున్నాట్టు శూన్యంలోకి చూస్తున్న తల్లి ముఖ కవళికల్ని గమనిస్తూంటూ భోజనం ముగించాడు ఈలోగా మధుర బయటి కొచ్చి టేబుల్‌సొరుగు లాగి చూడ్డం, పుల్లారెడ్డి నేతి మిఠాయిల డబ్బా చూసి "హమ్మా! ఎంతరుచిగా ఉంటుందో!" అనుకుని నోట్లో నీళ్లూరడం, నేనెక్కడ చూస్తానోననవి గబుక్కున ఇందులో దాచేశారు! పళ్లు కకొరుక్కోవడమై పోయినై మిఠాయిలు తల్లికే ఇవ్వాలా? పెళ్లాంకిస్తే పాపమా? గొణుక్కుంటుండగా ఆనందరావు బయటికొస్తున్న అలికిడి వినబడింది

.. మల్లినాథసూరి టౌనుహాల్లో కవిసమ్మేళన ముంది, వస్తావా మధురా?" పెళ్లాన్ని ప్రసన్నం చేసుకోవాలనే ఆరాటం అడిగించింది ఆనందరావును.

హైద్రాబాద్ నుండి ఆలస్యంగా వచ్చినందుకు అత్తాకోడళ్లు యుద్ధం ప్రకటించారు. కాబట్టి ముందు అర్ధాంగిని చల్లబరచాలి ఆ తర్వాత .. అమ్మకోపమా! ఒడిలో తలబెట్టి మా మంచి అమ్మ అంటే సరి. అమ్మ కోపం హుష్కాకి...

మొదటి కార్యక్రమంలో భాగంగా . చిలిపితనం చెంగలించిందతన్లో.. మధుర పక్కన చేరాడు. నున్నని బుగ్గల మీద చేతివేళ్ళు సున్నితంగా పాకాయి. మధుర ఎదలో గిలిగింతలు... కాని ఇప్పుడే లొంగిపోతే.. పాకెట్ పరమార్థం...?

నాలాంటి మొద్దావతారానికి కమ్మని కవిత్యం రుచిస్తుందా? మీ అమ్మను తీసుకెళ్లి హాయిగా ఎంజాయ్‌చెయ్యండి. రుసరుసల్లో మిళితమైన బుసబుసలు.

దెప్పిపొడుపు... ఆనందరావు పట్టుదలనుపెంచేసింది.

అబ్బా!అమ్మ కవిత్వం వింటుందా? నేను రాసిన ప్రతి కవితకు మొదటి శ్రోతవు, స్ఫూర్తి దాతవు నువ్వే గదా? స్ఫూర్తి దాత మారము చేస్తే నాపని సున్నా అవుతుంది బుజ్జీ!" గదవ అందుకని బుజ్జగింపు సేవలో లీనమయాడు

"ఏదో ఆ కవిత్వం అర్థమవుతుంది గానీ, మీ పైత్యాన్ని అర్థంచేసుకునే శక్తి సామర్థ్యాలు నాకున్నాయా?" చేతిని నిర్దాక్షిణ్యంగా తోసిపారేసింది.

"నువ్వేం మాట్లాడుతున్నావో ఏమో!" అయోమయం అగాధాన్ని సృష్టించింది. చక్కిలి గింతలు, చెక్కిలి స్పర్శలతో మరికొంత ప్రయత్నం సాగింది. ఫలితం శూన్యం. అసహనం మేల్కొంది.

"టైమైంది నే వెల్తున్నా..!" దిగ్గునలేచాడు.

ఈలోగా.. అమృతమ్మలో ఆసక్తి పొంగిపొర్లింది. టేబుల్ సొరుగు లాగిచూసింది. మెదడు పొరల్లో తాజా ఆలోచనలు

ఓహో! తల్లిచాటుకు పెళ్లానికి మిఠాయిలా! అందుకే అన్నారేమో. తల్లి అల్లం, పెళ్లా బెల్లమని. ఈ మిఠాయి ఇంటిల్లి పాది తింటే బాగుండదా? తలాకొంత పంచితే అవిడకు తక్కువైపోతుంది గదా!.... ఆనందరావు అడుగుల చప్పుడు... సొరుగు మూసేసి సర్రున కుర్చీలో కూచుంది.

"నేనెళ్లొస్తానమ్మా!" అంటూ వెళ్లాడు బయటికి. అమృతమ్మ కదేదో కొత్తగా కన్పించింది కొడుకు ప్రవర్తన.

అరెరే.. తెగేదా కాలాగుతున్నానా? అయనేమనుకున్నారో ఏమో! తన ప్రవర్తన తనకే చేదనిపించింది మధురకు. లేచి బయటి కొచ్చేసింది. భర్త లేడు. బయట పక్కింటి పిల్లలాడుకుంటున్నారు.

ఎప్పుడూ తల్లీకూతుళ్లలా కలుపుగోలుగా మసలుకునే అత్తాకోడళ్లు మూగజీవులయారు మూతులు ముడేసుకుని టీ.వి. ముందు కూచున్నారు. భౌతికంగా బొమ్మల్ని చూస్తున్నా మానసికంగా ఎవరిలోకంలో వారున్నారు.

కపసవన విహారము కమ్మని అనుభూతినిచ్చింది

ఆనందానుభూతిలో తేలిపోతూ ఆనందరావు ఇంటికొచ్చేసరికి రాత్రి తొమ్మిది దాటింది

"హైద్రాబాద్ నుండి ఎప్పుడొచ్చావురా ఆనంద్?" తలుపు తీసిన వెంకట్రామయ్యలో పుత్రవాత్సల్యం పొంగింది

"అప్పుడే వచ్చాను నాన్నా! మల్లినాథ సూరి టౌను హాల్లో కవిసమ్మేళనమైంది. దాంట్లో పాల్గొని వస్తున్నా. వరంగల్‌నుండి ఎప్పుడొచ్చావు నాన్నా?"

"నేనొచ్చి అరగంటయింది. హైద్రాబాదు విశేషాలేమిట్రా!"

అత్తాకోడళ్ల చెవులు తండ్రీకొడుకుల సంభాషణ మీదున్నై. పాకెట్ ప్రస్తావన ఎప్పుడొస్తుందాని ఎదిరిచూస్తున్నాయి.

కవిసమ్మేళనం విశేషాలు, వరంగల్ పెళ్లి విశేషాలతో పావుగంట గడిచింది. ఆ తర్వాత ఆనందరావు టేబుల్ సొరుగులాగి పాకెట్ బయటకు తీశాడు.

అత్తా కొడళ్ల ఒళ్లంతా కళ్లైపోయినై.

పాకెట్ విప్పుకుంది. విఠాయిడబ్బా మూత తెరుచుకుంది. మిఠాయిల వాసన గుమ్మనలేదు. చూపులన్నీ ఆనందరావు చేతుల మదున్నై. సినిమాలు వదిలినట్టుంది రోడ్డుమీద జనాల ముచ్చట్లు, నడకల చప్పుళ్లు.

"ఇది కాశ్మీరు శాలువా. నీకు బాగుంటుంది నాన్నా!" డబ్బాలోంచి శాలువా తీసి తండ్రి భుజాల మీదుంచాడు కొడుకు. గులాబిరంగు వులన్ శాలువా, చుట్టూ గోల్డ్ కలర్ తీగల అంచు... ఎంత బాగుందో!

బిత్తర చూపులతో అత్తాకోడళ్ల మొహాలు ఆరిపోయిన అగరొత్తులైపొయినై.

"ప్యూర్ వులన్! ఈ చలికాలంలో . వెచ్చాగా ఉందిరా!" మురిసిపోతున్నాడు వెంకట్రామయ్య.

"అది పుల్లారెడ్డి మిరాయిల డబ్బా గదరా ఆనంద్!"

ఆశ్చర్యాన్నాపుకోలేక పోయింది అమృతమ్మ

"డబ్బా పుల్లారెడ్డి మిరాయిలదే శాలువా గూడా వారిదే నిన్న సాయంత్రం హైద్రాబాద్‌లో జి. పుల్లారెడ్డి నేతి మిరాయిల యాజమాన్యం వారు రవీంద్రభారతిలో కవి సమ్మేళనం నిర్వహించారు నేను గూడా పాల్గొన్నాను. వారు కవులందరికీ ముందే మిరాయిలు తిన్పించి కవి సమ్మేనంలో కాశ్మీరు శాలువాలతో సత్కరించారు. తర్వాత వారి విరాయి డబ్బాలోనే శాలువా ప్యాక్ చేయించి యిచ్చారమ్మా! నా ఆలస్యానికి కారణం అది..."